క్లుప్తంగా

మడకశిరలో విస్తారంగా వర్షాలు

- 15 వరకు వేరుశనగ విత్తనం విత్తు కోవడానికి అవకాశం



కదిరేపల్లిలో వేరుశనగ విత్తనాలను విత్తుతున్న రైతులు

మడకశిర: నియోజకవర్గవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. మంగళవారం రాత్రి నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో వర్షాలు పడడంతో వేరుశనగ రైతులకు ఊరట లభించింది. అగళిలో 34.8, అమరాపురంలో 19.2, గుడిబండలో 36.4, రొళ్లలో 26.4, మడకశిరలో 10 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో రైతులు వేరుశనగ విత్తనాన్ని విత్తు కోవడానికి అవకాశం ఏర్పడింది. ఈ విషయంపై స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ మాట్లాడుతూ రైతులు ఈనెల 15 వరకు వేరుశనగ విత్తనం వేసుకోవడానికి మంచి అదునని తెలిపారు. విత్తనం శుద్ధి చేసుకుని, లోతుగా దుక్కి చేసి విత్తనాన్ని భూమిలో వేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలి

అమరాపురం: స్థానిక బంగారు పాళ్యం రోడ్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చాలంటూ ఎస్సీ కాలనీ వాసులు బుధవారం ఎంపీడీఓ మునిస్వామికి వినతి పత్రం అందజేశారు. వర్షం వస్తే ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఎంపీడీఓ మునిస్వామి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు.

108 వాహన సేవలు ప్రారంభం



వాహన సేవలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ తదితరులు

గోరంట్ల: ప్రభుత్వం ఇటీవల ఉమ్మడి అనంతపురం జిల్లాకు 12 నూతన 108 వాహనాలను మంజూరు చేసింది. అందులో భాగంగా గోరంట్లకు నూతన 108 వాహనాన్ని కేటాయించారు. బుధవారం గోరంట్ల ప్రభుత్వ వైద్యాధికారులతో కలసి ఎంపీడీఓ రఘునాథగుప్తా ప్రత్యేక పూజలు చేసి 108 వాహన సేవలను ప్రారంభించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గుడిబండ: మండల పరిధిలోని మోరుబాగల్ పంచాయతీలోని వీరజ్జనపల్లిలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులే తీసుకోవాలి




ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో సమావేశమైన ఎంఈఓలు

హిందూపురం: ప్రతి పాఠశాలలో గవర్నింగ్ బాడీ ఏ ఫీజులు నిర్ణయించిందో వాటినే తీసుకుంటూ ఫీజులను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి సూచించారు. బుధవారం ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌వీధిలో చోరీ

పెనుకొండ: పట్టణంలోని కమాన్ వీధిలో హరి అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ వివరాలమేరకు... కమాన్ వీధిలో నివాసం ఉండే హరితో పాటు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని పని నిమిత్తం మరో గ్రామానికి వెళ్లారన్నారు. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రూ.40 వేల నగదు, తులం బంగారు ఎత్తుకెళ్లారని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరించిన సిబ్బంది

లేపాక్షి: మండలంలోని మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తు పదోన్నతిపై ఇతర పాఠశాలలకు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సురేష్‌బాబు, ఎం.వాణి, యోగేశ్వర్, గంగాధర్, సలావుద్దీన్‌లను ప్రధానోపాధ్యాయుడు క్షీరలింగేశ్వర్‌తో పాటు ఉపాధ్యాయులు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు.

పారాహుషార్ !

హిందూపురానికి చెందిన ఇర్ఫాన్ ఓ బ్యాంకులో ఖాతా ఉంది. అయితే తన ఖాతా నుంచి రూ.3 వేలు నగదు డ్రా చేసినట్లు ఆయనకు మెసేజ్ వచ్చింది. అసలు తాను బ్యాంకుకుగాని, ఏటీఎంకుగాని, ఆన్‌లైన్ లావాదేవీని నిర్వహించకుండానే ఎలా డబ్బులు కట్ అయ్యాయి? అన్న ఆందోళనతోనే ఇర్ఫాన్ బ్యాంకుకు వెళ్లి ఆరా ఆరా తీశారు. ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్) ద్వారా డబ్బులు డ్రా చేసినట్లు చెప్పడంతో అవాక్కయ్యారు. పోలీసుల చుట్టూ తిరిగేది ఎందుకులే అనుకుని మిన్నకుండిపోయారు.

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- వేలిముద్రలతో బ్యాంకు ఖాతాల్లో డబ్బు స్వాహా
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు





హిందూపురం అర్బన్: ఎంతో కష్టపడి సంపాదించి బ్యాంకుల్లో దాచుకొన్న సొమ్మును సైబర్ నేరగాళ్లు సాంకేతిక సాయంతో సులువుగా కొట్టేస్తున్నారు. ఖాతాదారుల ప్రమేయం లేకుండానే బ్యాంక్ ఖాతాల్లో నగదు మాయమవుతుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

రోజుకు రూ.10 వేలు డ్రా చేసుకునే అవకాశం

ఏటీఎంలు లేని ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి చోట్ల ఖాతాదారులు ఇబ్బంది పడకూడదనే ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్)ను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండి ఏటీఎంలు లేని ప్రాంతాల్లో ఖాతాదారులు ఏఈపీఎస్ ద్వారా రోజుకు రూ.10 వేలు వరకు డ్రా చేసుకునే వెలుసులుబాటు కల్పించారు. ఈ అవకాశాన్నే సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకొని నకిలీ వేలిముద్రలతో సొమ్ము కాజేస్తున్నారు.

నకిలీ వేలిముద్రలతో...

ప్రస్తుతం ఆధార్‌కార్డు ప్రతి దానికి అవసరం అవుతోంది. రిజిస్ట్రేషన్ ఆఫీసులు, వివిధ పథకాలను పొందేందుకు ఆధార్, వేలిముద్రలు వేయడం సాధారణంగా మారింది. ఇందులో భాగంగానే సైబర్ నేరగాళ్లు సాంకేతిక సహాయంతో వేలి ముద్రలను సేకరిస్తున్నారు. కొందరు రబ్బరు వేలిముద్రల తొడుగులు తయారు చేసుకొని డబ్బు కొల్లగొడుతున్నారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ల నుంచి వేలిముద్రలు సేకరించి వాటిని పోలిన విధంగా వేలిముద్రలు తయారు చేసి ప్రత్యేక యాప్‌ల ద్వారా ఖాతాదారులు బ్యాంకుల్లో దాచుకొన్న నగదు దోచేస్తున్నారు.

లాక్ చేసుకుంటే మంచిది



మన వేలిముద్రలను ఇతరులెవరూ ఉపయోగించకుండా ఎంఆధార్ యాప్‌లో లాక్ చేసుకునే ఆప్షన్ అందుబాటులోకి ఉంది. దీన్ని ఉపయోగించుకుంటే మన ఫింగర్ ప్రింట్స్‌ను ఎవరూ ఉపయోగించేందుకు వీలుండదు. మనకు అవసరమైనప్పుడు ఎంఆధార్ యాప్‌లో బయోమెట్రిక్ అథెంటికేషన్‌ను అన్‌లాక్ చేసుకుని ఫింగర్ ప్రింట్‌ను ఉపయోగించుకోవాలి. ఆ తర్వాత తిరిగి దాన్ని లాక్ చేసుకోవాలి. ఎవరి ఖాతాలో అయినా డబ్బు పోతే 1930 కు ఫిర్యాదు చేయొచ్చు. – కంజాక్షన్, డీఎస్పీ

పనులు వెంటనే పూర్తి చేయాలి

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలో ప్రారంభించిన అభివృద్ధి పనులు వారంరోజుల్లోపు పూర్తిచేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ అన్నారు. బుధవారం కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. సాధారణ, 15వ ఆర్థిక సంఘం పనులు సుమారు వంద ఉన్నాయని వాటిని వెంటనే వెంటనే మొదలు పెట్టి మూడు నెలల్లో పూర్తిచేయాలన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో గుర్తించి చేపట్టిన 31 పనుల్లో 27 టెండర్లు పూర్తయ్యాయని, మిగిలిన వాటిని కూడా టెండర్‌ను వేసుకుని పనులు ప్రారంభించాలన్నారు. ఈ పనులు నెలరోజుల గడువులోపు పూర్తిచేయాలని చెప్పారు.

ఫిట్‌నెస్‌లేని బస్సులు తిరగనీయొద్దు

మడకశిర: 'మండలంలోని కొన్ని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల యజమానులు ఫిట్‌నెస్‌లేని బస్సులను నడుపుతున్నారు... విద్యార్థులకు భద్రత దృష్ట్యా ఫిట్‌నెస్ లేని బస్సులను నడపకుండా చర్యలు తీసుకోవాలని' బుధవారం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఉమేష్‌నాయక్ సీఐ సురేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

పనులపై సమీక్ష

రొళ్ల: మండలంలో చేపట్టిన రెండో విడత నాడు–నేడు పనులు వేగవంతం చేయడానికి ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక జెడ్పీ హెచ్ఎస్‌లో నాడు–నేడు అభివృద్ధి పనుల పై ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

8న లోక్ అదాలత్

పావగడ: స్థానిక జేఎంఎఫ్‌సీ కోర్టులో 8వ తేదీన లోక్ అదాలత్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎంఎస్ హరిణి ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

చిలమత్తూరు: రాష్ట్ర విద్యుత్, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాగేపల్లి టోల్ ప్లాజా వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనంతపురం జిల్లా పర్యటనకు వెళ్తుండగా ఎంపీపీ పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద నాయకులు కలిశారు. మంత్రితో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి రాగా ఆయనకు కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సమన్వయకర్తగా దీపికను ఎంపిక చేయడంపై నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి , మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులున్నారు.

మంత్రిని కలిసిన బాధితులు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద ఉన్న భూమిను ఇద్దరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి బాధితులు మంగమ్మ, శాంతమ్మ కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. సోమందేపల్లి వై జంక్షన్‌లో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహ మూర్తి, నాగరాజు,గంగాదర్ పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థినులకు పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని సాధన దిశగా పయనించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని సహాయ వాణిజ్య పన్నుల అధికారి గిరిధర్, ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి అన్నారు. బుధవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని, చివరి సంవత్సర విద్యార్థినుల వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాలలో ప్రథమ స్థానం పొందిన బీఏ, బీఎస్సీ, బీకాం విద్యార్థినులకు బంగారు పతకాలను అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని ఆకట్టుకున్నాయి.

డిగ్రీ కళాశాలలో రికార్డుల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌జేడీ నాగలింగారెడ్డి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం ఉన్నత విద్య ఆర్‌జేడీ నాగలింగారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందుతున్న కంప్యూటర్ శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రథమ సంవత్సరంలో చేరేవారికి ఎన్‌సీసీ, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

మడకశిర: మడకశిర రోటరీ క్లబ్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. బుధవారం పట్టణంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు సమావేశమై 2023–24వ సంవత్సరానికి నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా పుట్టకామప్ప, కార్యదర్శిగా రాఘవేంద్ర కుమార్, కోశాధికారిగా గోపాలకృష్ణ, సలహాదారుడిగా వరదరాజులు, అసిస్టెంట్ గవర్నర్‌గా తిమ్మారెడ్డి ఎంపికయ్యారు.

శిరాకు వెళ్లి పింఛన్ అందజేత



మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రికి చెందిన పింఛన్‌దారురాలు లక్ష్మమ్మ కర్ణాటక రాష్ట్రం శిరాలో వృద్ధాశ్రమంలో ఉన్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ రాజేష్‌కుమార్ బుధవారం శిరాకు వెళ్లి పింఛన్ అందించారు.

ఎస్సీ వర్గకరణ సాధించే దాకా పోరాటం

మడకశిర: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరాటం చేస్తామని జాతీయ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. ఆయన బుధవారం మడకశిరలో పర్యటించారు. ఆర్అండ్‌బీ బంగ్లాలో నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమయ్యారు. 7న హైదరాబాద్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ సభ విజయవంతంపై చర్చించారు.

దశాబ్దాల కల సాకారం

- గలిబిపల్లి రోడ్డు పూర్తవడంతో గ్రామస్తుల హర్షం



పూర్తయిన గలిబిపల్లి నుంచి కేపీ రోడ్డు

లేపాక్షి: మండల పరిధిలోని గలిబిపల్లి రోడ్డుకు మోక్షం లభించింది. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం వెళ్లాలన్నా కొడికొండ చెక్‌పోస్టు నుంచి ఈ రహదారి నుండే వెళ్లాల్సి ఉంది. గలిబిపల్లి నుంచి కేపీ రోడ్డుకు వెళ్లాలంటే స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. రెండు, మూడు సార్లు ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ రహదారి నుంచి హిందూపురం వెళ్లేటప్పుడు ఆయనను అడ్డగించి గ్రామస్తులు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. అయినప్పటికీ రోడ్డు మాత్రం ఏర్పాటు చేయలేక పోయారు. అయితే ఇటీవలే గ్రామ సర్పంచ్ ఆదినారాయణతో పాటు గ్రామస్తులు కూడా రెండు రోజులు పాటు ధర్నా చేశారు. దీంతో అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర రూ.35 లక్షలు నిధులను మంజూరు చేశారు. మరో రూ.6 లక్షలు నిధులు కేటాయిస్తే తప్ప గ్రామం వరకు రోడ్డు వేయలేమని కాంట్రాక్టర్ తెలిపారు. స్పందించిన సర్పంచ్ ఆదినారాయణ పంచాయతీ నుంచి రూ. 6 లక్షలు నిధులు కేటాయించడంతో రోడ్డు పూర్తయింది. రోడ్డు పనులు పూర్తి చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

- అర్హులకు న్యాయం చేసేందుకే 'జగనన్న సురక్ష'
- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



పెనుకొండ: ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: 'ఎన్నికల వేళ మాయమాటలు చెప్పి మరోసారి జనాన్ని మోసం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. ఆయన కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టాలి.. వంద శాతం సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు అందించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమం లక్ష్యం' అని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 3వ సచివాలయంలో జగనన్న సురక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొని లబ్ధిదారులకు కుల, ఆదాయ, బర్త్, డెత్, వివాహ, ఫ్యామిలీ మెంబర్ తదితర ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ ఏ రాజకీయ నాయకుడైనా తాను ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే తప్పించుకునేలా సాకులు వెదుకుతారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రం ప్రతి కుటుంబం లబ్ధి చేకూర్చాలనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల ద్వారా వారికి అనుకూలమైన వారికి సంక్షేమ పథకాలు అందేవన్నారు. నేడు అర్హత ఉంటే చాలు వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నారని చెప్పారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు 600 హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. త్వరలో ఎన్నికలు వస్తుండడంతో ప్రజలను మోసగించడానికి మాయ మాటలతో నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ప్రజలు ఆయనను ఛీకొట్టాలని, లేకపోతే జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేసి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టడం ఖాయమన్నారు. ప్రధానంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు న్యాయం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ వంశీకృష్ణభార్గవ్, స్పెషలాఫీసర్ పద్మమ్మ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్లు సునీల్, నందిని, ఎంపీపీ గీత, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడమే జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని మండల సచివాలయ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, ఎంఎల్‌ఓ పవన్ తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో గ్రామ సచివాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమై జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు.

అమరాపురం: మండలంలోని కె.శివరం, వలస, హలుకూరు, బసవనపల్లి తదితర గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష సర్వే చేపట్టారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ 11 సేవల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తామని అధికారులు తెలిపారు.

అగళి : మండల పరిధిలోని మధుడి గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్ శివకుమార్ మాట్లాడుతూ ప్రజలందరికీ రక్ష జగనన్న సురక్ష అన్నారు. 11 రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు.

మడకశిరరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వంద శాతం అర్హులకు న్యాయం చేస్తామని ఎంపీపీ కవిత తెలిపారు. మండలంలోని సీ కొడిగేపల్లి, గోవిందాపురం గ్రామ సచివాలయాల వద్ద బుధవారం జగనన్న సురక్ష క్యాంపులు జరిగాయి. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు.

చిలమత్తూరు: అర్హత ఉండి సంక్షేమ ఫలాలు పొందని అర్హులందరికీ జగనన్న సురక్ష ద్వారా న్యాయం చేకూరుతోందని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోడూరు మన్రోతోపులోని సచివాలయం వద్ద సర్పంచ్ మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 817 మంది ధ్రువపత్రాలు అందజేశారు.

నేడు జగనన్న సురక్ష ఇలా...

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

గోరంట్ల: మండల పరిధిలోని గౌనివారిపల్లి, మలసముద్రం గ్రామ సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా పేర్కొన్నారు.



అగళి: మధుడి సచివాలయంలో 'జగనన్న సురక్ష 'జరుగుతున్న దృశ్యం



చిలమత్తూరు: కోడూరు తోపులో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి

ఈ-సర్వీసెస్ వేగవంతం చేయండి

రొళ్ల: సచివాలయాల ద్వారా అందిస్తున్న ఈ–సర్వీసెస్‌ను సిబ్బంది వేగవంతం చేయాలని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కాకి సచివాలయాన్ని ఈఓఆర్డీ క్రిష్ణప్పతో కలిసి సందర్శించారు. వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద ఉచితంగా 11 రకాల సర్టిఫికెట్లను అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం ఇందిరమ్మ కాలనీలో స్థలం వ్యవహారంలో బుధవారం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. స్థానికుల వివరాలమేరకు.. సర్వేనంబర్ 180లో ప్లాట్ నంబర్ 184లోని రెండు సెంట్ల స్థలంపై వెంకటేష్ , వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన బోయ చిరంజీవి మధ్య వాగ్వాదం జరిగింది. వివాదం చినికి చినికి గాలివానలా మారడంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. దాదాపుగా 9 మంది తమ కుటుంబలపై దాడికి పాల్పడ్డారంటూ వెంకటేష్ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్య సరస్వతి, తమ్ముళ్లు గోవిందు, ఆదిమూర్తి గాయపడ్డారన్నారు. పోలీసులు, అధికారులు దీనిపై విచారణ చేయాల్సి ఉంది.

చిన్నారుల సంరక్షణపై అవగాహన

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లిలో చిన్నారుల సంరక్షణపై బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వరకు పిల్లలను ఏ విధంగా రక్షించాలి? బిడ్డ ఎదుగుదల, భాషాభివృద్ధి, సృజనాత్మకతక తదితర వాటిపై సీడీపీఓ శాంతలక్ష్మి అవగాహన కల్పించారు.

విరివిగా గుంతలు తవ్వించండి

రొళ్ల: ఉపాధి పథకం ద్వారా డ్రైలాండ్ హార్టికల్చర్ కింద పండ్లతోటలు సాగు చేయనున్న రైతులచే విరివిగా గుంతలు తవ్వించడానికి క్షేత్రసహాయకులు చర్యలు తీసుకోవాలని ఏపీఓ ఓబుళప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలకు అవసరమైన పనులు కల్పించి సంఖ్యను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికై నిరసన

హిందూపురం టౌన్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 10, 11న జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి లావణ్య తెలిపారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో కరపత్రికలు విడుదల చేశారు.

పట్టు రైతులతో సమావేశం

అగళి: మండల పరిధిలోని ముత్తైపల్లి గ్రామంలో పట్టు రైతులతో సహాయ సంచాలకులు రాజునాయక్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ముత్తేపల్లి రైతులు, హలికేర, ఇనగలురు రైతులు, టీఏ నాగరాజు, జయరాము, జాన్‌పాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు రీఅడ్మిషన్లు

లేపాక్షి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రీఅడ్మిషన్ చేసుకున్నట్లు హెచ్ఎం సుధామణి తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులను పిలిపించుకొని విద్యార్థులను రీ అడ్మిషన్ చేసుకున్నామన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యే విధంగా తర్ఫీదు ఇస్తామని తెలిపారు.